సంపుటి :02 సంచిక :62 పేజీలు :01

అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

వెల ₹5

ఆదివారం 20, ఏప్రిల్ 2025




రిపోర్టర్లు కావలెను

అక్షర దర్బార్

నిత్యం నూతనంగా వెలువడుతూ.. అతి తక్కువ కాలంలోనే విశేష ప్రజాదరణ పొందిన 'అక్షర దర్బార్' తెలుగు దినపత్రికలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ సెంటర్లో పనిచేయుటకు అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.

ఖాళీలు : హనుమకొండ, వరంగల్, మడికొండ, మామూనూరు, ఎల్కతుర్తి, భూపాల్లిపల్లి, ములుగు, జనగామ, స్టేషన్ ఘన్ పూర్, వర్ధన్నపేట, మహబూబాబాద్, ఏటూరు నాగారం

వివరాలకు సంప్రదించండి :7680992278



# సత్యవతిపై రవీందర్‌రావు గుస్సా..

## మానుకోట బీఆర్ఎస్‌లో ముదిరిన పంచాయితీ

- మాజీ మంత్రిపై ఎమ్మెల్సీ ఫైర్
- మీడియా సమావేశంలోనే బహిరంగ విమర్శలు
- పార్టీలో అందరినీ కలుపుకొని పోవడం లేదంటూ ఆగ్రహం
- సీనియర్ నేత ఇలా వ్యవహరించడం సరికాదంటూ చురకలు
- కేసీఆర్ ఇచ్చిన బాధ్యతను నిలబెట్టుకోవాలని హితవు
- జిల్లాలో సమర్థ నాయకత్వం కొరవడిందని ఆరోపణలు
- ఇప్పటికే బీఆర్ఎస్ రజతోత్సవ సభపై నీలి నీడలు !
- నేతల మధ్య రచ్చకెక్కుతున్న విభేదాలు

**అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి:** మానుకోట బీఆర్ఎస్‌లో లుకలుకలు మొదలయ్యాయి. ఇంతకాలం నివురుగప్పిన నిప్పులా ఉన్న అంతర్గత విభేదాలు ఒక్కసారిగా రచ్చకెక్కాయి. సీనియర్ నేత, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు మధ్య రజతోత్సవ సభ చిచ్చు పెట్టింది. సభకు జనాన్ని తరలించే సన్నాహాక ప్రక్రియలో భాగంగా నేతల మధ్య ఐక్యత లోపించడంతో వివాదం రాజుకుంది. రజతోత్సవ సభ జిల్లా సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న.. సత్యవతి రాథోడ్‌పై సొంత పార్టీ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు తీవ్ర విమర్శలు చేయడం హాట్‌టాపిక్‌గా మారింది. ఇప్పటికే రజతోత్సవ సభపై నీలినీడలు కమ్ముకుంటున్నాయని వార్తలు వస్తున్న నేపథ్యంలో మానుకోట జిల్లాలో గులాబీ పార్టీలో సీనియర్ నేతలుగా ఉన్న ఈ ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు బహిర్గతమవడంతో నాయకులు, కార్యకర్తల్లో గందరగోళం నెలకొంది.

### సత్యవతి విఫలమయ్యారు..

మానుకోట జిల్లా బీఆర్ఎస్‌లో ఐక్యతాలోపం స్పష్టంగా కనిపిస్తోంది. సీనియర్ నేతగా ఉన్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అధిష్టానం ఆదేశాలను అనుసరించి నాయకులను, కార్యకర్తలను కలుపుకొని పోవడవం లేదని ఎమ్మెల్సీ రవీందర్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ జిల్లాకేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన రవీందర్‌రావు మాజీ మంత్రి సత్యవతిపై విమర్శలు ఎక్కుపెట్టారు. ఎవరికి వారే యమునా తీరుగా వ్యవహరించడం సరైంది కాదని హితవుపలికారు. జిల్లా సమన్వయకర్తగా సత్యవతి రాథోడ్ పార్టీ శ్రేణులను అందరిని కలుపుకొని పోవాలని ఈ సందర్భంగా సూచించారు. నేతల్లో సఖ్యత కుదరడంలేదని.. కనీసం తనకు ఫోన్ కూడా చేయలేదని ఎమ్మెల్సీ రవీందర్ రావు మండిపడ్డారు. అందరినీ ఒకే తాటిపై నడిపించే సమర్థ నాయకత్వం జిల్లాలో కొరవడిందని ఆరోపణలు చేశారు. అంతేగాక ఎంతో నమ్మకంతో కేసీఆర్ అప్పగించిన బాధ్యతను వమ్ముకాకుండా చూసుకోవాలని సత్యవతికి చురకలంటించారు. అధినేత ఆదేశాలను ప్రతి ఒక్కరూ తూచ తప్పకుండా పాటించాలని ఆయన కోరారు.

## రజతోత్సవ సభపై నీలినీడలు

బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో అట్టహాసంగా సభ నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నప్పటికీ .. పార్టీలో మాత్రం సభ సక్సెస్ అయ్యేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధినేత కేసీఆర్ రజతోత్సవ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించి నేతలకు దిశానిర్దేశం చేస్తున్నారు. స్వయంగా రంగంలోకి దిగి జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహించారు. జన సమీకరణపై నియోజకవర్గాల వారీగా నేతలకు టార్గెట్ విధించి సభను విజయవంతం చేసి సత్తా చాటాలని భావిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఓవైపు దంచికొడుతున్న ఎండ.. మరోవైపు లోపించిన నాయకత్వంతో సభ సక్సెజ్ అయ్యేనా అని పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ముఖ్య నేతల మధ్య సఖ్యత కొరవడటం, అధికారం కోల్పోయినప్పటి నుంచి కేడర్‌కు దూరమవడం, గ్రామాల్లోనూ గతంలో ఉన్న ఊపు పూర్తిగా తగ్గిపోవడం మైనస్‌గా మారే ప్రమాదం ఉందన్న చర్చ జరుగుతోంది. మరోవైపు గులాబీ క్యాడర్ చాలా వరకు అధికార పార్టీ గూటికి చేరుకోవడంతో గ్రామాల నుంచి తరలివచ్చే అవకాశాలు తక్కువే అన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

# ఆర్టీసీలో కొలువుల జాతర

- 3038 ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్
- సాధ్యమైనంత త్వరగా భర్తీ ప్రక్రియ
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- నిరుద్యోగులకు సర్కార్ గుడ్ న్యూస్



అక్షరదర్బార్, హైదరాబాద్ : నిరుద్యోగులకు తెలంగాణ సర్కార్ గుడ్‌న్యూస్ చెప్పింది. ఆర్టీసీలో 3038 ఉద్యోగాలకు త్వరలోనే నోటిఫికేషన్ విడదల చేస్తామని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఆర్టీసీలో సుదీర్ఘ కాలం తర్వాత ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రారంభిస్తుండటంపై మంత్రి పొన్నం హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 3,038 ఉద్యోగాల భర్తీకి ఇప్పటికే ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని.. త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేసి సాధ్యమైనంత త్వరగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. డ్రైవర్, శ్రామిక్. డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్), డిప్యూటీ సూపరింటెండెంట్ (మెకానికల్), డిపో మేనేజర్/ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్, అసిస్టెంట్ ఇంజినీర్ (సివిల్), సెక్షన్ ఆఫీసర్ (సివిల్), అకౌంట్ ఆఫీసర్స్, మెడికల్ ఆఫీసర్స్ జనరల్ తదితర పోస్టులు భర్తీచేయనున్నారు.

### సుదీర్ఘ కాలం తర్వాత..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన ప్రభుత్వం ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తుందని దీని ద్వారా ఆర్టీసీలో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగిందని మంత్రి పొన్నం తెలిపారు. ఇప్పటి వరకు ఆర్టీసీలో 165 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని.. వారు 5500 కోట్ల రూపాయలు ఆదా చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే మహాలక్ష్మి కోసం కొత్త బస్సులు కొనుగోలు చేశామని, ఇప్పుడు ఉద్యోగాల భర్తీకి ఆర్టీసీ సన్నద్ధం అయిందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ పోస్టులకు త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రజా పాలన ప్రభుత్వంలో నిరుద్యోగులకు పెద్దపీట వేస్తూ దాదాపు 60 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశామని ఈ సందర్భంగా మంత్రి పొన్నం గుర్తు చేశారు. ఇప్పుడు మరోసారి భారీస్థాయిలో ఉద్యోగాల నోటిఫికేషన్లను.. జాబ్ క్యాలండర్ ప్రకారం విడుదల చేయనున్నామని ప్రకటించారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బాగా ప్రిపేర్ కావాలని సూచించారు. ఆర్టీసీలో సుదీర్ఘ కాలం తర్వాత ఉద్యోగాల భర్తీ జరుగుతుండటంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.